# వెధవఘోషా

శ్రీ యస్. యమ్. అక్బర్ గారు

'అది ఒక్కటే చాతనౌను మనవాళ్లకి. నోరుతెరిస్తే ఖురాను. నిజంగా పావనఖురాన్‌నే పాటిస్తే యావజ్జగత్తూ 'ఇస్లాం' మయమై ఉండవలసిందే. అపార్థాలు కల్పించి అప్రతిమాన దైవవాక్కును సంశయాపాత్రము చేస్తున్నారు. శాస్త్రవేత్తలు ఉన్నారు కాని సంఘశృంఖలములకు బద్ధులు. బురఖాను బూడిదగల్పిన తురుష్క ప్రజాస్వామ్య సృష్టికర్త కెమాల్ పాషా 'ఖురాను' చదువలేదా. ఆతడు కురాన్ నిబంధనలను ఈవిషయంలో ఉల్లంఘించుటలేదనే నాయూహ.'

బీబీతో సహా ప్రయాణం కదదామనుకున్నా. పదిహేను దినములు సెలవుకూడా పొందాను ఆఫీసులో. ప్రయాణం రెండురోజులే ఉంది. అలంకారాలన్నీ సిద్ధపర్చుకుంటున్నాం. పొరుగూరి కెడితేనేగా పోకడలుమారాల్సింది.

నేను ఆధునికపద్ధతులపై నడిచే యువకుణ్ణి. మా బీబీకూడా యించుమించు అంతే ఒక్క ఘోషాతప్ప! సరే మానాన్న ఓ చిన్న 'గాంధీవాలా.' కాని ఘోషావిషయంలో మాత్రం సంఘానికి ఝడిసిపోయాడు. ఘోషానెపంతో సంఘం వెలివేస్తే తిండికీ గుడ్డకూ లోటుండదు. కథకూ, కార్యానికీ ఖర్చు తగ్గుతుంది! చస్తేమాత్రం 'చచ్చరి'వాళ్లు పూడ్చవలసొస్తుందేమో అనేదే భయం!

మా బీబీ మూడేళ్లక్రితం గరల్సు హైస్కూల్లో మూడో 'ఫారం' 'ప్యాస్' అయ్యింది. తెనుక్కూడా చాలా యుక్తంగా మాట్లాడుతుంది. తాను మూడవ ఫారం ప్యాసయినా 'ముచ్చికి ముమ్మా'టంటూ మూడు సంవత్సరాలూ చదివి మూడో 'లిస్టు'లో S. S. L. C. ప్యాసయిన నన్ను బోల్తా కొట్టించడానికే ప్రయత్నిస్తుంటుంది.

బీబీని పిలిచి యిలా అన్నాను: "బీబీ కనీసం రైలెక్కిందగ్గర్నుంచీ పర్దా (ముసుగు) విసర్జించాలి."

బీ:—ఏం రైల్లోమాత్రం మగాళ్లుండరా?

నే:—ఉంటే ఉంటారు. రైలుపెట్టిదగ్గర్నుంచి 'ట్రైన్'వరకూ చేయాలేమిటి ఈ పర్దాప్రదర్శనం.

బీ:—సరే, మొదలెట్టండి పర్దాప్రతికూలప్రచారం. ప్రవక్త మొహమ్మదువారిచే సహితం ప్రబోధింపబడి పెద్దలచే అనుకరింపబడిన 'బురఖా' (మేలిముసుగు) 'తప్పు' అన్నమాట మీకు?

నే:—'తప్పు' అని ఎన్నడూ అనను. పెద్దల నియామకం మంచిదే! కుమార్తెను తండ్రీ, తల్లిని కుమారుడు, తోబుట్టును అన్నదమ్ముడూ, ఒకరేమిటి ప్రతిమానవుడూ యుక్తాయుక్త విచక్షణలేక పశుతుల్యంగా, పరమ అసహ్యంగా, రాక్షసాధముల్లాగు బలవంతంగా పాతివ్రత్యాన్ని, సచ్ఛీలాన్ని, సౌకుమార్యాన్నీ బుగ్గిగల్పే రోజుల్లో, ఆ ఏడవశతాబ్దంలో ఆ అరేబియా దేశంలో ప్రవక్త మొహమ్మదువారిచే 'ఘోషా' ఉద్బోధింపబడ్డం సంఘశ్రేయోభిలాషచే! కాని యిప్పుడు ఈ హిందూదేశంలో ఈ ఇరువదవ శతాబ్దంలో యింతటి నవనాగరికతజ్యోతియొక్క కాంతిలో ఘోషాపిశాచనగ్న తాండవం దేనికి, భారతీయులు పశువులనుకున్నావా? గొఱ్ఱెలమంద లనుకున్నావా?

బీ:—మీ రేమన్నా అనండి. బురఖా ఉంటే

మగపిశాచాల దృగ్బాణాలు విరజిమ్మబడవు. నిరంతరం రకరకాల రంగురంగుల పురుషుల్ని చూడకపోవడంచేత స్త్రీయొక్క శీలం అంతత్వరగా వంచింపబడదు.

నే:—బురఖా ఉంటే నిశ్చలం, బురఖాలేకపోతే చంచలం అన్నమాట నీ ఉద్దేశములో స్త్రీశీలం. స్త్రీయొక్క శీలం ఏదన్నా ఒకరకమైన భాస్వరం అనుకున్నావా యేంటి? సీసాలోఉంచితే భద్రముగా ఉండి వాయువులో ఉంచగానే కరిగిపోవడానికి? వెర్రినాగమ్మా—శీలానికి కంటిదృక్కుకు సంబంధం ఉండుగాక. బజారులవెంట స్వేచ్ఛగా తిరిగే స్త్రీలందరి శీలం సునాయాసంగా వంచింపవచ్చునన్న మాట? ముమ్మాటికి తప్పు. చూపులలో శీలం మారిపోతుందా? నిరంతరం మగాళ్లను చూస్తూంటే శీలం ఎంతమాత్రం మారదు సరిగదా రకరకాల రంగురంగుల పురుషుల క్రొత్త క్రొత్త పైత్యాధికప్రవర్తనలు చూస్తూంటే అసహ్యంకూడా వేస్తుంది. దృగ్బాణాల్తోనే శీలం మారిపోతుందనుకో. దారినిపోయే స్త్రీని ఎవ్వడూ చూట్టానికి ప్రయత్నించడు కాని బురకాలోఉన్న స్త్రీ అపరిచితము, నూత్నము కాబట్టి చూట్టానికి ప్రయత్నించి, సాధ్యమైతే ప్రయోగిస్తాడు దృగ్బాణాల్ని.

బీ:—సరే బురకా ఉంటే ఎంతో లేకపోయినా అంతే. ఘోషావల్ల వచ్చే లాభమూ లేదు. నష్టమూ లేదు. నేను బురఖా ఒక అలంకారంగా వాడతాను.

నే:—ఘోషాతో ఉంటే నష్టంలేదూ? హానియే ఉంది! దేవుడిచ్చిన గాలి, సూర్యరశ్మి లేక పాలిపోయి, తెల్లబడి, ఇంట్లోనేఉండి దుర్గంధవాయువునే పీలుస్తోంటే నానా జబ్బులకు గురికావలసివస్తుంది. 'ఫస్టుఫారం'లో నేర్చుకోలేదా. నీడలో పెరిగిన మొక్కకూ, ప్రకృతిలో పెరిగిన మొక్కకూ తారతమ్యం. అధోగతికీడ్చేది అలంకారమా?

బీ:—అయితే బురఖా పాటించేవారందరూ పామరులేనా? మీరేనా మహాపండితులు? ఈ పర్దా పాటించేవారిలో శారీర శాస్త్రవేత్తలు లేరా? ఉంటే తెలిసి ఊరుకున్నారా?

నే:—ముమ్మాటికీ పామరులే. నిరంతరం ఇళ్లల్లో కూర్చొని సూర్యరశ్మిని, మలయమారుతాన్ని, ప్రకృతి వీక్షణాన్ని పరాభూతమొనర్చుమని స్త్రీల కుద్ఘాటించి తాము బజారులవెంట బయల్దేరడం పామరత్వం కాదూ? మహమ్మదు ప్రవక్తవారు పురుషునికంటె స్త్రీకే ఎక్కుడు హక్కుల నిచ్చియున్నారే! మగవాళ్లను చూచి ఆడుది చపలఅవటం నిజమైతే సంఘానికి తలవంపు. స్త్రీనిచూచి పురుషుడు పశుతుల్యుడౌట మాత్రం నిజంకాదా. పశుతుల్యుడు సంఘానికి రాక్షసుడు కాడా.

బీ:—'ఖురాను'లో అట్లా వ్రాసుందిట.

నే:—అది ఒక్కటే చాతనౌను మనవాళ్లకి నోరుతెరిస్తే ఖురాను. నిజంగా పావనఖురాన్‌నే పాటిస్తే యావజ్జగత్తూ 'ఇస్లాం' మయమై ఉండవలసిందే. అపార్థాలు కల్పించి అప్రతిమానదైవవాక్కును సంశయాపాత్రము చేస్తున్నారు. శారీర శాస్త్రవేత్తలు ఉన్నారు కాని సంఘశృంఖలములకు బద్ధులు. బురఖాను బూడిదగల్పిన తురుష్క ప్రజాస్వామ్య సృష్టికర్త కెమాల్‌పాషా 'ఖురాను' చదువలేదా. అతడు కురాన్ నిబంధనలకు ఈవిషయంలో ఉల్లంఘించుట లేదనే నాయూహ.

బీ:—అయితే నేడు ధనవంతులు బురఖాను విసర్జించినా అంతగా అనేవారుండరు. మనబోటి వాళ్లు సంఘానికి బలికావలసిందే.

నే:—అవును. ముమ్మాటికి ధనమే మతాన్ని మారుస్తోంది. అపార్థాలను వెదజల్లుతోంది. మతగురువులు ధనానికి దాసులు. భాగ్యవంతుడు ధనానికి యజమాని. అంచేత ధనవంతులజోలికి మతగురు

వులు అంతగా చొరకొనరు. నేడు మన భారతదేశంలో మహమ్మదీయు లెక్కుడుమంది నిరుపేదలు కారా? పొలముల్లో, మిల్లుల్లో కూలినాలి చేసుకోవటం లేదా? వాళ్లకు బురఖాలులేవే! వారి పాతివ్రత్యం, శీలం, మంటిలో కలుస్తుందా? బురఖాబోబుల శీలం భోషాణప్పెట్టెల్లో భద్రంగా ఉంటుందా?! పిచ్చి చేష్టలు. తినడానికి అన్నంలేక ఇంటిలో మ్రగ్గుతూన్న జీవనోపాధిసాధనం నిరోధించుట ఘోషాయొక్క ముఖ్యోద్దేశమా! లేక పైత్యవికారమా?!

బీ:—(బేలగా) ప్రపంచంలో ఘోషా అక్కర లేదన్నమాట. అవుతే ఆరోజులొస్తే మానేస్తారులెండి అందరూను.

నే:—ఆరోజు మరెప్పుడొస్తుంది! మనం ఇంకా వెనుకటిపద్ధతుల్నే, వెనుకటి మతమాత్రల్నే మ్రింగుతోంటే మరెప్పుడొస్తుంది. మన నడవడి వెనక్కే! మనంకూడా ప్రతివిషయంలోనూ వెనక్కే! నూత్న తేజాన్ని విరజిమ్మే స్వాతంత్ర్య జ్యోతిర్మయ కాంతుల్లో ముందుకు నెట్టుకొనిపోయే భారతీయోత్సాహాన్ని వెనక్కి దిగబీకడమే!! హృదయాల్లో ఊహాజ్వాలల్ని ఇముడ్చుకొని ఉబికితే దిగమింగుతూ నోళ్లకు తాళాలు, చేతులకు సంకెళ్లూ వేసుకొని ఎందరు నారీరత్నములు మ్రగ్గుతూ గోడుగోడు మంటున్నారో ఈ ఘోషాగోడల్లో!!!

బీ:—సరే. బెజవాడ దాటితే తీసివేస్తాల్లెండి బురఖా.

నే:—ఊహుఁ. సరే 'గుడ్డిలో మెల్ల!'

౨

గోదావరిస్టేషను కెళ్లాం మధ్యాహ్నం బండికి. రెండు పెట్టెలు ఒక పెద్దబెడ్డింగు 'లగ్గేజి' చేయించి నేను కూర్చొన్న పెట్టిలో వేయించాను. బీబీ చేతికి టిఫిన్ కేరియరిచ్చి ఆడాళ్ల పెట్టిలో కూర్చుండబెట్టాను. రైలు బొయ్యిమంటూ పొగలు గ్రక్కుకుంటూ 'బ్రిడ్జి' ఎక్కింది. బెజవాడలో 'గృహలక్ష్మి' కొని బీబీదగ్గరికి తీసుకెళ్లాను. బురఖా అలానేఉంది. "ఇంకా తీయవేంటి 'బురకా' " అన్నా. "స్టేషను దాటితే" అంది నిమ్మళంగా బీబీ. వెళ్లి పెట్టిలో కూర్చున్నా.

జనం క్రిక్కిరిసి ఉన్నందున రైలు దిగనేలేదు. సరే. సెంట్రల్ స్టేషను వచ్చేసింది. రైలు ఆగి ఆగడంతోటే కూలీలచేత సామాన్లు పట్టించుకున్నాను. బీబీకోసం ఆడాళ్ల పెట్టివైపు వెళుతున్నాను. ఆపాదమస్తకంగా ఉన్న 'బురఖా'లో బీబీ ప్లాటుఫారమ్మీద నించుంది. స్టేషనునుంచి త్వరగా బయటపడాలని ఉంది నాకు. నా త్వరితాన్ని చూచి కాబోలు బీబీ నావైపే నడిచివస్తూంది. సరే. స్టేషనుబయట పడ్డాం. మా బీబీ 'ట్రేడ్ మార్కు' చూచి కాబోలు నేనో 'సాహెబ్ జీ' ననుకొని ఇద్దరు రిక్షావాళ్లు ఉర్దూలో బేరాలు చేయుటం మొదలెట్టారు. ఆ రిక్షావాళ్లు ఉర్దూలో మాట్లాడంచేత నాతో మాట్లాడ్డానికి సిగ్గుపడి కాబోలు ఊరుకుంది నా బీబి. సిగ్గుపడేదాన్తో మాట్లాడ్డానికి నాకూ మనస్కరించక ఊరుకొన్నాను. రిక్షాలు వేగంగానడచి ఓ విశాలమైన మేడఎదుట నిలిచాయి. సామాను దించేశారు. ఇద్దరమూ దిగాము. బీబీ కొంచెము నావైపేవచ్చి ఆగి ఆకాశంవంక చూస్తోంది. రిక్షావాడు సత్రము గుమాస్తాను గాబోలు పిలిచాడు. రిక్షావాళ్లకు నిర్ణయించుకొన్న రు. 1-8-0 ఇచ్చేసాను. "చాల కష్టపడ్డాం బాబూ ఒకబేడ ఇప్పించండి" అన్నాడొకడు. పాపం! ఆ పాలిపోయిన ముఖాన్నిచూచి జాలివేసింది నాకు. నాదగ్గర చిల్లరలేదు. బీబీకిచ్చిన అరరూపాయలో ఏమయినా మిగిల్నాయేమోనని "రెండణాలివ్వు" అన్నాను బీబీవైపు తిరిగి. నా నోటినుండి సగంమాట పెగలకముందే బీబీ ఉలిక్కిపడింది. ఆ విద్యుద్దీపకాంతులలో ఎదుట గోడలు కట్టినట్టుగాఉన్న దోమతెరగళ్లను చీల్చ

కొంటూవచ్చిన ఆమె నేత్రకిరణం నన్ను కబళించేట్టు కనిపించింది. ఆమె కళ్లల్లోకి చూస్తూ 'ఇవ్వు' అన్నాను. జవాబు రాలేదు. ఈ రెండణాలకోసము ఇంత దయగలమనిషి ఎందుకు ఇంత ఇలా పట్టు పట్టిందా అనుకున్నా. బేడ ఇవ్వడానికి బురఖా కాస్తా తొలగించటానికి ఆ రిక్షావాళ్ల ఎదట సిగ్గు పడుతున్నదేమోనని 'Doesn't matter' (పరవా లేదు) అన్నా. అనీ అనడంతోటే బీబీ కాస్త వెనక్కి జరిగింది.

ఆమె తనకళ్లను దించివేసింది. కంటిరెప్పలను మూసేసి నావేపునుండి ముఖాన్ని త్రిప్పుకొని నిల్చింది. అంత సిగ్గుగలమనిషి ఈ నడిరోడ్డుమీద ఈ ఇద్దరు కూలీలెదట ఎందుకాలా వేళాకోళం చేస్తుందా అని ఆశ్చర్యంవేసింది నాకు. సహజంగా వెంకిమనిషి గాదాయెను! ఆ మౌనముద్ర, ఆ వేళాకోళం నా కేమాత్రం మనస్కరించలేదు. మమకారం అంతా పోయి మహాకోపంగా మారింది. ఈ వెధవ బేడకోసం ఈ కూలీలెదట అర్థించడం నాకూడా సిగ్గేసింది. "Don't be silly" అన్నా సీరియస్‌గా నిమ్మళంగా.

'పనేమిరా' జవాబు శూన్యం. వినపడకపోవడానికి ఆపాదమస్తకంగా వేసుకొన్న ముసుగు అంత దళసరిగాలేదు. కాని నామాట బీబీ వినిపించుకోదు సరిగదా, నన్ను ఒక పరాయివాడిలాగ చూస్తూ మరీ దూరంగా పోయినించుంది. మొహం అసలే చూపదు. ఎవరన్నాచూస్తే నన్నేమని భావిస్తారు చెప్పండి. వట్టి 'బ్రూటు' కాకపోతే భార్య ఇంతదూరం జరిగి పోయి నించుంటుందా! ఇంత వివేకములేక పల్లెటూరి పశువులా బెదరిపోయి దూరదూరంగా నిర్లక్ష్యంగా నించోడం ఎంత శాంతుడికయినా కోపం తెప్పిస్తుంది? నా కరికాలుమంట నెత్తికెక్కింది. ఆ రిక్షావాళ్లు లేకపోతే దవడ 'సాఫు' చేద్దామనుకున్నా.

"నిన్నే" అన్నాను మహాకోపంతో. ఆ అపూర్వ నాట్యదృశ్యాన్ని చూచి కాబోలు అప్పుడే బయటకు వచ్చిన సత్రం గుమాస్తాగారూ, 'రిక్షావాలాలు' మొగాలు బొండీచేటల్లాగ చేసుకొని చూస్తున్నారు. జవాబుకోసరం బీబీకి దగ్గరగా వెళ్లాను. ఇంకా వెనక్కే నడుస్తుంది. ఈమాటు చిన్నమంటలేచి నా మనోవీధిని పొగగ్రమ్మింది. పరిపరివిధాలు ఆలోచిస్తున్నా. చుట్టూచూచా నొకమాటు. బీబీ చేతికిచ్చిన టిఫినుకేరియరు 'గైరుహాజ' రవడం గమనించా. 'ఇదా సంగ' తనుకుంటూ 'ముందు బేడఇవ్వు. తరవాత చూచుకొందాం' అన్నా ఎంతో శాంతంగా మను తలో.

లక్ష చెప్పండి! నోరు విప్పదు. సరిగదా దూర దూరంగా జరిగి జరిగి సత్రపుగోడకు ఆనుకుంది. శాంతం నా హృదయంలోంచి మాయమైంది. చర చరా బీబీదగ్గిరి కెళ్లాను.

నాగుండె ఝల్లుమంది. ఎర్రబారిన ముఖం కన బడింది బురఖాలోంచి. కన్నీ రేకధారగా కారు తోంది. వెచ్చగా శ్వాస విడవలేక విడుస్తోంది నా అర్థాంగి అకారణంగా! ఆ పాదమస్తకం నిదానించి చూచా. వొళ్లో 'చెయిను' మాయమైంది. సంగ తంతా గ్రహించాను. రిక్షావాళ్లను ఏవిధంచేతనైనా పంపించేసి బీబీని ఓదార్చి బుజ్జగించి సంగతి కను క్కుందామనుకున్నాను. కాని ఆరవవాళ్లను నమ్మ కూడదు. వీళ్లే కాజేసారేమోనని 'వెధవచెయిను పోతేపోయిందిలే. ఏడవకు' అని మరి కాస్త దగ్గరగా వెళ్లాను. ఆమె హద్దులేని ఖంగారుపడుతూ మొద లెట్టిందో కూనిరాగం. నాఊహ నిశ్చయమైం దను కున్నాను. ఇంకా ఉపేక్షిస్తే లాభంలేదు! స్థాయి మించి రాగములోకి దిగుతుంది. 'మరి సిగ్గుపడ నక్కరలే' దనుకొని ఆమె భుజమ్మీదికి చేయిజాస్తూ 'పరవాలేదులే బీబీ. వెధవచెయిను', అన్నా. నా చేయి ఇంకా సగందారిలో ఉండగానే చివాలున ప్రక్కకుదాటుతూ "నేను మీ బీబిని కాను" అంటూ

మొదలెట్టిందో చిన్నపల్లవి. ఆమె లైటుస్థంబము దగ్గర ఉండటంచేత ఆదాటులోనే కనుపించింది ఆ అపరిచితముఖం మేలిముసుగులోంచి అపరిచితకంఠము తోపాటు!!! అప్రయత్నంగా "బీబీ గాకపోతే మరి మీరెవ" రన్నాను. వణికిపోతూ "రాజు లమ్మాయి నండీ, బెజవాడ" అంది. "అయితే మాబీబీ" అన్నాను వేలగా. "తెలీదు" అంది.

నాహృదయంలో వందరైళ్లు పరుగెత్తసాగాయి. నా మెదడు దిమ్ముపట్టింది. నా అంతరాత్మ నాతో చెప్పకుండానే నాకు తెలియకుండా నా నోటినుండి "అయ్యో బీబీ, బీబీ" అనిపించింది. "ఎన్నా, ఎన్నా" అంటూ అరవన్నలు ముగ్గురు అల్లేసారు నన్ను. నా బిత్తిరిపోయే కాళ్లక్రింద భూమి వణకినట్లగుపించింది. ఎంచేతో రోడ్డు స్పష్టంగా కనపట్టంలేదు. లక్షఊహలు నా మనస్సులో 'తటపటా' కొట్టుకుంటున్నాయి. నా ఊహలన్నింటికీ ఒకటే లక్ష్యం. నా బీబీ—నా బీబీ—నా సర్వస్వము.

ఇకను కంగారుపడితే ప్రయోజనములేదు. రెండే రెండు ఊహల్ని స్థిరపర్చుకొన్నా. బీబీ మదరాసు చేరకముందే మాయమైందా? లేక స్టేషనులో తప్పిపోయిందా? వీటికి జవాబు శూన్యమే! నా హృదయం ఎందుకో కుదుటపడ్డది. అంతలోనే బీబీ ఏమయిపోయినా ఈ రాజులమ్మాయి నావెంట ఎందుకొస్తుంది? అనుకున్నాను. తుదమొదల్లేక దుఃఖిస్తున్న ఆమెనుచూచి ఇలా అన్నాను. "మీరేం భయపడకండి. నాతో మీ రెందుకువచ్చారు. పైగా ఎందు కేడుస్తున్నారు........"

నే నింకా అడగబోతున్నాను. ఫర్లాంగుదూరాన్నుంచి "అగ్బార్!! అగ్బార్!! రే అగ్బార్!!!" అని పెద్దకేకలు వినబడ్డాయి. వెనక్కి తిరిగిచూశాను. ఆ అమ్మాయి ఆలాపన ఆట్టే కట్టిపెట్టింది. రెండు రిక్షాలు, ఒక సైకిలూ నా దృగ్గోచరమయ్యాయి. ఆ బైసికిలుపై ఓ పోలీసు పిక్కబలాన్నంతా వినియోగించి త్రొక్కుతున్నాడు! ముందరి రిక్షాలో ఓ మగాడుమాత్రం కూర్చున్నాడు. వెనుక రిక్షా మొదటిదానికి వెనక్కుండడంచేత నాకు సరిగ్గా కనబడ్డంలేదు.

నా గుండెల్లో పెద్ద బండపడ్డట్టయింది. సంగతంతా అవగాహనం చేసుకున్నాను. నా ఖర్మ మిలా కాలింది. అర్ధాంగి అగమ్యగోచరం!! నేనో—పోలీసు స్టేషనులోనా!! నేనేం నేరంచేసాను చెప్పండీ? ఈ అపరిచిత అబల్ని నేను ఖలవంతానగాని తెలిసియుండిగాని తీసుకొనిరాలేదే! లేకపోతే ఇదంతా అరవపితలాటమా? అనుకున్నా. అనుకుంటూన్నంతలోనే జన్మలోలేని పరాభవము జరగబోతుందేమో నని నామీద నాకే జాలివేసింది. ఆ పోలీసు సైకిలు దిగీదిగడంతోనే "Thank God" అన్నాడు. ఆయువకుడు దిగాడు. సూటూ బూట్లూ అచ్చా నాలాగే తయారయ్యాడు. నాదగ్గరకు గబగబావచ్చి "గాబరా పడుతున్నావేంటిరా అక్బర్" అంటూ భుజంతట్టాడు నాతో చదువుకున్న రామరాజు!!! ఈలోగా ఆ రెండో రిక్షాలోంచి ఓ బురఖాదిగి "రంయ్"మంటూ వస్తూంది నాప్రక్కకు. నేను నిర్ఘాంతపోయాను. 'వెధవ బురకాల్లే'రా అంటూ మొదలెట్టబోయాడు ఓవర్ణన. నాప్రక్కనున్న బురఖా నాచేయి లంకించుకొని "వెధవఘోషా" అంటూ మొదలెట్టింది.